4న ఎల్లమ్మ దేవి బోనాలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఎల్లమ్మ దేవి ఆలయంలో ఈ నెల 4న (ఆదివారం) బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అమ్మవారికి ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, 8 గంటల నుంచి అర్చన, బోనాలు, ఒడిబియ్యం సమర్పణ, సాయంత్రం 4 గంటల నుంచి రథోత్సవం, పోతరాజుల విన్యాసాల నడుమ ఫలహార బండి ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


స్టూడెంట్ క్యాబినేట్‌కి ఎన్నికైన విద్యార్థులతో ఏజీఎం సతీష్, ప్రిన్సిపాల్ రిజ్వానా

మలక్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్స్ దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీష్ అన్నారు. మూసారంబాగ్ ఎస్‌బీఐ కాలనీ బ్రాంచీలో గురువారం నిర్వహించిన 'ఇన్వేస్టిచర్ సెర్మనీ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చక్కని భావజాలం, విశాల దృక్పథం, సామాజిక సేవాభావం కలిగిన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్టూడెంట్ క్యాబినేట్‌కి ఎన్నికైన విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, డీఎస్ శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మీ, పీఈటీ నరేష్‌నాయక్, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెరాయిన్ విక్రేత రిమాండ్

నాగోలు: నిషేధిత మాదక ద్రవ్యం (హెరాయిన్) విక్రయించడానికి ప్రయత్నించిన వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..రాజస్థాన్ బార్మర్ జిల్లా, సిదాసనా హర్నియర్ గ్రామానికి చెందిన విక్రమ్‌కుమార్ అలియస్ విక్రమ్‌గోయెల్(28) నగరానికి వచ్చి సికింద్రాబాద్, మోండా మార్కెట్ వద్ద ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా చేస్తున్నాడు. వచ్చే డబ్బులు సరిపోక మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో రాజస్థాన్‌కు చెందిన దినేష్ కల్యాణ్‌తో పరిచయమై అతని వద్ద తక్కువ ధరకు హెరాయిన్ కొనుగోలు చేసి నగరంలో ఎక్కువ ధరకు విక్రయించేవాడు. అయితే దినేష్ కల్యాణ్ రాజస్థాన్ నుంచి రైలులో నగరానికి వచ్చి హెరాయిన్ ఇచ్చి వెళ్తుంటాడు. బుధవారం రాత్రి ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు సమీపంలో దినేష్ కల్యాణ్ నుంచి విక్రమ్‌కుమార్ హెరాయిన్ కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు విక్రమ్‌కుమార్ అరెస్టు చేసి 32.55 గ్రాముల హెరాయిన్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దినేష్ కల్యాణ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ అభివృద్ధే లక్ష్యం


లావణ్య

చంపాపేట: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధే తన లక్ష్యమని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ ఈఓ లావణ్య స్పష్టం చేశారు. జూబ్లీ హిల్స్ శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా విధులు నిర్వర్తించిన ఆమె బదిలీపై గురువారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు, స్థానికులు, ఆలయ సిబ్బంది, అర్చకుల సహకారంతో ఆలయాన్ని ప్రముఖ తీర్థ స్థలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఆలయ ఇన్‌చార్జి ఈఓగా ఉన్న శ్రీనివాసశర్మ శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, శ్రీనివాస్, సంతోష్, అర్చకులు సంతోష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మలక్‌పేట: ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ (ఫెడ్) సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 6 నెలల పాటు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సెక్రటరీ చెరుకు నాగభూషణం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా,ఆఫీస్ ఆటో మిషన్, డెస్కటాప్, పబ్లిషింగ్ కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమోతో ఈ నెల 5న పేర్లు నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 93817 06624, 94940 19888 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై పోరాడదాం



మన్సూరాబాద్: ప్రజల పక్షాన నిలబడి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలు, అధికార కాంగ్రెస్ పార్టీపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల కృషితో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మన్సూరాబాద్ డివిజన్ నుంచి 9 వేలకు పైచిలుకు మెజారిటీ వచ్చిందని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడిందని, విచారణకు చేపట్టాలని కోరాల్సిన అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో క్లెం రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, సాయిరాంగౌడ్, జగన్, కవితారెడ్డి, చిల్కూరి మాధవి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి

హయత్‌నగర్: డివిజన్‌లో రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆయన పారిశుద్ధ్య జవాన్ యాదయ్యతో కలిసి డివిజన్‌లోని అన్మగల్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వచ్చె ఆదివారం బోనాల పండుగ ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించాలని విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యల తప్పవని హెచ్చరించారు.

నేడు జీఎస్ఐలో ఆల్ ఇండియా కాన్ఫరెన్స్

మన్సూరాబాద్: జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ సంఘ్ 5వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ శుక్రవారం ఉదయం 11 గంటలకు జీఎస్ఐ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఎంఎస్ ఆల్ ఇండియా ఉద్యోగ ప్రభారీ ఎస్డీ పట్‌బాజే, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ప్రభారీ చెన్నకేశ రావు హాజరవుతారన్నారు.

బదిలీల పర్వం..

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో భర్తీకాని టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ పోస్టులు

ప్రజా సేవలకు అంతరాయం!


- అధికారులను నియమించకపోవడంతో పేరుకుపోతున్న ఫిర్యాదులు
- స్పందించని ఉన్నతాధికారులు

ఎల్‌బీనగర్ పరిధిలోని జోనల్, సర్కిళ్ల కార్యాలయంలో బదిలీలతో ప్రజా సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి ఆయా విభాగాలకు చెందిన అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. జోనల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసే జోనల్ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రసాదరావు హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించక పోవడంతో ఆయన రిలీవ్ కాలేదు. రేపో మాపో ఆయన వెళ్లిపోవడం ఖాయమవ్వడంతో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన సేవలు నిలిచిపోనున్నాయి. ఇదే విభాగంలో నెల రోజుల క్రితం ఏసీపీగా పనిచేసిన రాజేందర్‌యాదవ్ జూన్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఈ విభాగంలో ఒక్కరే ఏసీపీ పనిచేయడంతో పనిభారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటి వరకు ఆయన స్థానంలో ఎవ్వరు రాకపోవడం గమనార్హం. -ఎల్‌బీనగర్


ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం

సర్కిళ్లలోనూ ఇదే దుస్థితి..

ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో పనిచేసే టౌన్ ప్లానింగ్ విభాగంలో నెలల తరబడి పోస్టులు ఖాళీగా ఉన్నా ఇప్పటి వరకు భర్తీ కాలేదు. దీంతో ఈ విభాగంపై ప్రజల నుంచి వందల సంఖ్యల్లో ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు లేక సమస్యలు పెరిగిపోతున్నాయి. సర్కిల్-3లో పనిచేసే ఉమ గతేడాది అక్టోబర్‌లో ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఇద్దరు అధికారులు చేసే పనులను అక్కడ ఒకరు మాత్రమే పనిచేయడంతో అనుమతుల జారీతో పాటు పలు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి, సర్కిల్-4లో పనిచేసే ఏసీపీ నెల రోజుల పాటు సెలవులో వెళ్లడంతో ఆ స్థానాన్ని ఇన్‌చార్జి ఏసీపీతో భర్తీ చేసినా అనుమతుల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే విభాగంలో పనిచేసే టీపీఎస్ శ్రీదేవి తాజా బదిలీలో భాగంగా ఆమె ఇతర మున్సిపాలిటీకి వెళ్లగా ఆమె స్థానంలో ఇంత వరకూ ఎవ్వరు రాకపోవడంతో భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇక సర్కిల్-5లో ఐదు డివిజన్లు ఉండగా ఒక ఏసీపీ, మరొక టౌన్ ప్లానింగ్ అధికారి మాత్రమే ఉన్నారు. ఇక్కడ ముగ్గురు ఉండాల్సిన అధికారులు ఒక్కరే ఉండడం విశేషం.



పారిశుద్ధ్య విభాగంలో..

పారిశుద్ధ్య విభాగాల్లో పనిచేసే అధికారులు సహాయ వైద్యాధికారులు లేకపోవడంతో ఈ విభాగంలో ఇంజినీరింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. మూడు సర్కిళ్లకు ఇంజినీరింగ్ అధికారులే ఉండటంతో పనులన్నీ తూతూ మంత్రంగానే జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో సర్కిల్-4లో పనిచేసే ఇంజనీరింగ్ అధికారి వెంకటేశం నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవ్వరు రాకపోవడంతో నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని అధికారులే పేర్కొనడం గమనార్హం. ఏళ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్నా బదిలీలు లేకపోవడం వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

మాదిగల చిరకాల ఆకాంక్ష సాకారమైంది

మలక్‌పేట: సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుతో మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీవర్గీకరణ సాకారమైందని చిట్టుపాక ప్రభాకర్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, రమేష్, వెంకటస్వామి, సతీష్, ముత్తయ్య, నవీన్, వీరస్వామి, మహేష్ పాల్గొన్నారు.


మందకృష్ణ మాదిగ, ప్రధాని చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మాదన్నపేటలో సంబురాలు..

చంచల్‌గూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో గురువారం పాతబస్తీ మాదన్నపేటలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ విగ్రహాలకు నివాళులర్పించారు. మాదిగ కుల సంఘాలు, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ..వర్గీకరణతో మాదిగ ఉప కులాల ప్రజలు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌యాదవ్, తంగెళ్ల సుధీర్, బండా వెంక్‌రెడ్డి, నాగరాజు, బ్రహ్మచారీ, మోహన్‌కృష్ణ, జనపాల మధు, ప్రదీప్, శ్రీకాంత్, ప్రేమ్, వెంకట్ పాల్గొన్నారు.

మాదిగల పోరాటానికి దక్కిన విజయం..

మన్సూరాబాద్: 30 ఏళ్లుగా మాదిగలు చేస్తున్న న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు అతిగొప్ప విజయమని జోగు రాములు అన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ప్రధాని మోదీ చిత్రపటాలకు దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, లక్ష్మయ్య, రమేష్, విష్ణువర్ధన్, కిరణ్, శంకర్, ఏసుబు, విజయ్, రజనీ, మహేష్, నాగరాజు, మోహన్, నరేష్, లింగస్వామి, మారెమ్మ, అశోక్ పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటానికి న్యాయం..

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల పోరాటానికి న్యాయం దక్కిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై న్యాయ, రాజకీయ, సామాజిక పరమైన అంశాలను పరిగణలోకి తీసుకుని ఎస్సీ వర్గీకరణకు సమర్థిస్తూ తీర్పు వెలువరించిందన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రభాకర్ మాదిగ


ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 27, వంకాయ రూ. 45, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 50, కాకర రూ. 48, బీర రూ. 40, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 37, దొండ రూ. 40, చిక్కుడు రూ. 75, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 38, దోస రూ. 16, సొర రూ. 13, పొట్ల రూ. 15, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వినతి

నాగోలు: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉద్యోగంలో ఉండి చనిపోతే వారి కుటుంబ సభ్యులలో ఒక్కరికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం కల్పించాలని మాన వ హక్కుల పరిరక్షణ సంస్థ రంగారెడ్డి జి ల్లా చైర్మన్ అశోక్ గురువారం మహిళ, శి శు, వికలాంగుల ప్రభుత్వ కార్యదర్శి కరు ణ వాకాటికి వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నాగోలు: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో గురువారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించార. హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి నాగోలు, అల్కపురి, సాయినగర్ ప్రధాన రోడ్డులో జరుగుతున్న పనులు, కార్మికుల హాజరు విధానాన్ని పరిశీలించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళ అదృశ్యం

చైతన్యపురి: పనికోసం వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన చైతన్య పురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ వివరాల ప్రకారం ..రాంనగర్‌లో నివసించే శంకర్ భార్య విజయలక్ష్మి (40) అల్కాపురిలోని ఎస్‌వీఎం హోమ్స్‌లో పని చేస్తోంది. గత నెల 25న పనికి వెళ్లిన ఆమె రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగించుకోండి

హుడాకాంప్లెక్స్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ సంస్థలు రాణిస్తున్నాయని బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం.నర్సింహులు అన్నారు. గురువారం సరూర్‌నగర్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు హుడాకాంప్లెక్స్ నుంచి కొత్తపేటలోని కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ప్లకార్డుల ప్రదర్శన చేశారు. ఎఫ్‌టీటీహెచ్, హెచ్‌జీ సిమ్‌లను ప్రమోట్ చేశారు. అనంతరం డీజీఎం మాట్లాడుతూ.. ఇతర ప్రైవేటు సెల్‌ఫోన్ సంస్థలకు పోటీగా బీఎస్ఎన్ఎల్‌ను తీర్చిదిద్దామని,రూ.249లకే 45 రోజులు అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చన్నారు.

సబితక్క జోలికొస్తే ఊరుకోం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

బడంగ్‌పేట్: ప్రజల కోసం పనిచేస్తున్న సబితా రెడ్డిని కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసి అవమానించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం చౌరస్తాలో రాకపోకలు నిలిపివేసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల బాగుకోసం శ్రమిస్తున్న సబితారెడ్డిపై కుట్ర పన్ని, కక్ష్యసాధింపు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని అడుగడుగున అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, భీమిడి జంగారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేశ్, మాధవరెడ్డి, పుట్టగళ్ల సంతోష్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, నందినేని నరేందర్‌డ్డి, గౌర సాయి, బాలేశ్‌చారి, మహిళలు ఉన్నారు.



చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్: కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును పరిరక్షించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన గురువారం ఏఈ మల్లికార్జున్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నర్సింహా భిక్షపతి, ఇరిగేషన్ అధికారులు డీఈ ఉషారాణి, ఎఈ తస్వీన్ రజాక్‌తో కలిసి చెరువును పరిశీలించారు. శివారు ప్రాంతానికి చెందిన హత్తిగూడ చెరువు కబ్జాకు గురవుతుందని పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చెరువు కబ్జాకు గురవుతోందని ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువును రికార్డులు తారుమారు చేసి 2 ఎకరాలకు కుదించారన్నారు. చెరువులోకి వచ్చే వరద కాలువలు, చెరువు హద్దులను కొందరు ధ్వంసం చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. చెరువు కబ్జాకు పాల్పడుతున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జ్యోతి, వీఆర్ఏ మల్లేష్, నాయకులు కదారి యాదగిరి యాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


చెరువు వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

విధులను బాధ్యతగా నిర్వర్తిస్తే ప్రజలు గుర్తుంచుకుంటారు


నర్సరాజు దంపతులను సత్కరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించినప్పుడు ప్రజలు గుర్తుంచుకుంటారని అలాంటి వారే డీఆర్‌డీవో ఉద్యోగి నర్సరాజు అని క్రాంతిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సప్పిడి యాదగిరిరెడ్డి అన్నారు. నర్సరాజు పదవీ విరమణ సందర్భగా బుధవారం రాత్రి కాలనీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నర్సరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. గత 35 ఏళ్లుగా తమ విధులను సక్రమంగా నిర్వహించడంతో అప్పటి డీఆర్‌డీవో డైరెక్టర్, మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చేతుల మీదుగా 1990లో పురస్కారం అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, సందడి ఆనంద్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌గౌడ్, జంగయ్య, రామానుజరెడ్డి,హైకోర్టు న్యాయవాది భార్గవ్, రామచంద్రారావు, గుండు మల్లేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల దిష్టి బొమ్మల దహనం



దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. అసెంబ్లీలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ద్వారా అత్యున్నత పదవులు పొంది కాంగ్రెస్ పార్టీపైనే విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, మధుసూధన్ రావు, ఉపేందర్ రెడ్డి, లక్ష్మీ, రేణుక, రమేష్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్, సైదులు, శేఖర్, అక్బర్, మహేందర్, భూపాల్ రెడ్డి, కల్యాణ్, లింగస్వామిగౌడ్, కిరణ్ కుమార్, రాజు నాయక్, సలీం పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

మలక్‌పేట: ఫుట్‌పాత్ ఆక్రమణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్, శానిటేషన్ డీఈ వెంకటపతి, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్ రెడ్డి మూసారంబాగ్‌లో పర్యటించారు. దిల్‌సుఖ్‌నగర్, ఆండాళ్ నిలయం, సలీంనగర్ ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై ఉన్న నిర్మాణాలు, షెడ్డులను తొలగింపజేశారు. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో మోసం

ఇద్దరి రిమాండ్


నవీన్‌కుమార్, ఫణికుమార్

నాగోలు: పెట్టుబడి ముసుగులో బాధితులను మోసం చేసి డబ్బులు కాజేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. రాచకొండ సైబర్ క్రైమ్ సీఐ కాశీవిశ్వనాథ్ వివరాల ప్రకారం.. నగరంలో నివాసముండే వంశీకృష్ణరావు తన స్నేహితులైన రాజేష్, ఒరిస్సా, కోరాపుట్ జిల్లా, జైపూర్‌కు చెందిన ధవలేశ్వరపు నవీన్‌కుమార్, గుంటూరుకు చెందిన జెట్టి ఫణికుమార్‌తో కలిసి ఆన్‌లైన్ మోసాలకు తెరలేపారు. వాట్సాప్ నంబర్ల ద్వారా అమాయకులను పరిచయం చేసుకుని వారికి టెలిగ్రామ్, ఆర్‌టీ హర్వే పేరిట ఏర్పాటు చేసిన గ్రూప్‌లో యాడ్ చేశారు. రాకేష్ పేరిట బేగంపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఆర్‌టీ సర్వీసెస్ పేరిట ఓ ఖాతా తెరిచారు. ఎస్ఆర్‌నగర్ సమీపంలోని మధురానగర్‌లో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నవీన్‌కుమార్, ఫణికుమార్ టెలీకాలర్లుగా అవతారమెత్తారు. ఆన్‌లైన్ పెట్టుబడుల ద్వారా అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని అమాయకులను నమ్మబలికారు. మొదట్లో కొత్త లాభాలను చూపించి రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించారు. బాధితుల నుంచి డబ్బులు తీసుకుని అనేక బ్యాంకు ఖాతాలను తెరిచి అందులో జమ చేసుకున్నారు. ఈ క్రమంలో ఓ బాధితుడు నిందితులు చెప్పిన బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేయగా ఎలాంటి స్పందన రాకపోవడంతో రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గత నెల 24న వంశీకృష్ణారావు, రాజేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ కేసులో పరారీలో ఉన్న నవీన్‌కుమార్, ఫణికుమార్‌ను గురువారం అరెస్టు చేసి ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల బ్యాంక్‌లో ఉన్న రూ.22 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. దాదాపుగా 300 మంది మోసపోయినట్లు తెలుస్తోంది.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

కార్పొరేటర్ భిక్షపతిచారి

మీర్‌పేట: తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని మీర్‌పేట 27వ డివిజన్ కార్పొరేటర్ భిక్షపతిచారి అన్నారు. సిర్లాహిల్స్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో కార్పొరేటర్ అక్కి మాధవితో కలిసి భిక్షపతిచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినప్పటినుంచి ఆరునెలల వరకు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాల గురించి అవగాహన కల్పించి, గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ, ఎల్.కవిత, సూపర్‌వైజర్ జ్ఞానకుమారి తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులు, బాలింతలకు గుడ్లు అందజేస్తున్న కార్పొరేటర్లు భిక్షపతి, మాధవి